# 25. భర్త

సొరిస్ విధవభార్య మెటిల్డాను వివాహాడే సమయానికి, ఆంటోనీ ఆమె ప్రేమలోపడి పదో సంవత్సరం గడుస్తోంది. సొరిస్ అతని సహాధ్యాయీ, స్నేహితుడూను. ఆంటోనీకీ అతనంటే చాలా ఇష్టం; కాని సొరిస్ వట్టి మూర్ఖుడుగా అతని దృష్టిలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నాడు. అందుకనే ఆంటోనీ సొరిస్‌ను గూర్చి "ఎన్నేళ్లు గడిచినా వాడి జ్ఞానం వృద్ధికాదు" అంటూండేవాడు.

సొరిస్ మెటిల్డాను వివాహమాడేప్పటికి తను ఆమెను ప్రేమిస్తున్నాడు కనుక, ఆంటోనీకి ఆశ్చర్యమూ, బాధా కలిగినయ్. ఆమె తన పొరుగునవున్న భాగ్యవంతుని కూతురు; తెలివితేటలుండి, మంచి మర్యాద తెలిసిన అందమైన పిల్ల. ఆమె సొరిస్‌ను వివాహమాడేందుకు ఒక్కటే కారణం - అది అతని ధనం!

ఆంటోనీకి మెటిల్డామీద పూర్తిగా ఆశలు విజృంభించినయ్. తను అందమైన వాడు; మూర్ఖత్వం తనలోలేదు; అందుకనే యీ ప్రేమ గాథలో తను జయం పొందగలడనే ధైర్యం తనకుండేది. కాని యీ వివాహం సొరిస్‌తో అవటం వల్ల తను ఓడిపొయ్యాడు. ఆనాటినుంచీ అతనొక పిరికి ప్రేమికుడుగా తయారయ్యాడు. అతని ప్రేమ గాఢమైనదైనా అది వట్టి భర్తత్వానికోసం ఉవ్విళ్లూరేదిగానే పెరిగింది. మెటిల్డా, సొరిస్ భార్యయ్యాక - ఆంటోనీ చూపులూ, చేతలూ పూర్వంలాటివి కావనే అభిప్రాయంతో, అతన్నొక స్నేహితుడిగా చూడసాగింది. ఈ పరిస్థితుల్లో కథ తొమ్మిది సంవత్సరాల్ని దాటింది.

ఒకనాటి ఉదయం - తన భర్త అకస్మాత్తుగా గుండె జబ్బువల్ల చనిపొయ్యాడని మెటిల్డా పంపిన వార్త ఆంటోనీని జేరింది. స్నేహితుడుకూడా తన యీడువాడే కావటంవల్ల అతని కిదొక పెద్ద దెబ్బగా కనిపించింది; కాని మరుక్షణానే మనస్సు

తేలిగ్గావుండే ఒక సంతోషం అతనిలో ప్రవేశించింది; దీనికి కారణం - మెటిల్డాకు స్వేచ్ఛ లభించటమే!

సమయానికి సరిపడేట్టు దుఃఖాన్ని సూచించగల నేర్పు ఆంటోనీలో వుంది; సరైన సమయం కోసం అతను వేచి కూర్చున్నాడు. మామూలుగా జరగాల్సిన తంతులన్నిటినీ జరిపించి, సంవత్సరానికల్లా మెటిల్డాను భార్యగా గ్రహించాడు.

మొదటినుంచీ ఒకర్నొకరు బాగా అర్థంచేసుకొన్న వ్యక్తులు కనుక వారు సౌఖ్యపడసాగారు. వారిద్దరిమధ్యా రహస్యమనేది లేదు; హృదయాల్లో ఏ భావమైతే వుందో - అదే మాటల రూపం దాల్చేది. ఆంటోనీ ఇప్పుడు తన భార్యను తనతో సమానంగా చూసుకుంటూ, అతి నమ్మకమైన ప్రేమతో ఆమెను ఆరాధించసాగాడు. కాని సౌరిస్ ఆమె మొట్టమొదటి అధికారై ఆమె యవ్వనంలోని కొంత భాగాన్నీ, ఆమె అందానికి సంబంధించిన కవిత్వపు మాటల్లోని కొన్ని భావాల్నీ లాక్కోగలిగాడు. ఇది ఆంటోనీకి సౌరిస్‌మీద ఒక హేయభావాన్ని రేపి, అతన్ని బాధించసాగింది. ఆ చనిపోయిన భర్త జ్ఞాపకం యీ బతికివున్న భర్త సౌఖ్యాన్ని పాడుచెయ్యగలిగింది. సౌరిస్ మీది యీ ద్వేష భావం ఆంటోనీని రాత్రింబగళ్ళు బాధించేది.

దీని ఫలితం --- ఆంటోనీ ఎప్పుడూ సౌరిస్‌ను గూర్చి అధిక ప్రసంగం చెయ్యటంగా మారింది. సౌరిస్ అలవాట్లనూ, వ్యక్తిగత ఇష్టాయిష్టాల్నీ గూర్చి భార్యను లక్షప్రశ్నలువేసి, జవాబులు తీసుకున్నాక, సౌరిస్ అభిరుచులు ఎంత పెడమార్గానవున్నదీ సూచిస్తూ, అనేక రకాలుగా అతన్ని ఎగతాళిచేస్తూ ఆత్మతృప్తి కోసం - సౌరిస్‌ను సమాధి అగాధాల్లోకి కూడా తరిమితరిమి తిడుతూండేవాడు.

ఇందుకుగాను పనివేళా భార్యను పిలిచేవాడు. ఆమె వచ్చి, "ఎందుకూ?" అని అడిగేది.

"రా-ఇలా కూర్చో....ఏమన్నా మాట్లాడుకుందాం."

తమ మాటలకు నాయకుడు సౌరిస్ అనేమాటను గుర్తిస్తూ, యీ రెండో భర్త తృప్తికోసం ఆమె కూర్చునేది.

"పొడుగాటి మనుషులకన్న, పొట్టివాళ్లే స్త్రీల ప్రేమకు పాత్రులని ఒకనాడు సౌరిస్ రుజూ చేసేందుకు తంటాలు పడ్డాడు - నీకు జ్ఞాపకమేనా?"

ఈ ప్రశ్న అడిగి, సౌరిస్ మూర్ఖపుమాటలకు నవ్వుతూ, అతని వ్యక్తిగత రూపాన్ని నోరారా తిడుతూ - తను పొడుగువా డవటం వల్ల, ఒక విధంగా తనను సమర్థించుకునేవాడు.

మెటిల్డా మాత్రం తను అంతా ఒప్పుకుంటూన్నట్టే సూచించేందుకు - భర్త మాటలకు అడ్డు వెళ్లేదీ కాదు. ఈ రెండో భర్త ఆనందం కోసం ఆమెకూడా హృదయపూర్వకంగా నవ్వుతూ, మొదటి భర్తను ఎగతాళి చేసేది.

చివరకు ఆంటోనీ, "ఏం అనుకోక - సౌరిస్ వట్టి మూర్ఖుడు" అనేవాడు.

ఆమె నవ్వి ఊరుకునేది. ఈ విధంగా వారు సౌఖ్యపడసాగారు.

ఒకరాత్రి - ఒక కొత్త యవ్వనోద్రేకంవల్ల ఇద్దరూ మేల్కొల్పబడ్డారు. ఆంటోనీ ఆమెను గట్టిగా కావిలించుకుంటూ, ఆమె పెదవుల దగ్గర మెల్లిగా, "ఇది నాకు చెప్పవ్?" అన్నాడు.

"ఏమిటీ?"

"సౌరిస్...ఇది ప్రశ్నించటం అంత తేలిగ్గాలేదు - సౌరిస్ ఆకర్షవంతంగా ఉండేవాడా?"

ఆమె ఆంటోనీని ముద్దుపెట్టుకుంటూ, "మీ అంతగాకాదు-" అంది.

ఈ పొగడ్తకు అతని పురుషత్వం ఎగిరిపడ్డది.

"వాడికో పొట్ట ఉండి వుండాలి...అవునా?"

ఆమె జవాబు చెప్పలేదు. భర్త కంఠానికి తన ముఖాన్ని ఆనిస్తూ చిరునవ్వు నవ్వింది. కాని అతనుమాత్రం తన ప్రశ్నను వదలలేదు.

"అతనికో పొట్టవుంది...అతను వికారంగా ఉండేవాడు...ఒప్పుకో- అవునా?"

తల కొద్దిగా ఆడిస్తూ ఆమె, "ఊ...కొంచెం వికారంగానే-" అంది.

"నిన్ను చాలా రాత్రులు ఎక్కువగాశ్రమ పెట్టివుంటాడని నా నమ్మకం- అవునా?" అన్నాడు మళ్లీ.

ఈసారిమాత్రం ఆమె ఎక్కువ శ్రమపెట్ట కుండానే జవాబిచ్చింది: "అవును-"

ఇంత మంచి సమాధానానికి ఆమెను ఇంకోసారి గట్టిగానే కావిలించుకుంటూ, "వాడిదొక గాడిదస్వరూపం...వాడితో నువ్వేమీ సౌఖ్యపడి ఉండవనుకుంటాను-ఏం?" అని అడిగాడు.

"ఉహుఁ అతను మామూలుగా సంతోషంగా ఉండేవాడు కాదు-"

దీంతో ఆంటోనీకి పరమానందమైంది; తన భార్య పూర్వపుస్థితికీ, ప్రస్తుత స్థితికీ ఊహలో పోల్చుకున్నాడు. అలానే నిశ్శబ్దతలో గడిచిపొయ్యాక, కొత్త ఆతృతతో, "నాకిది చెప్పు-" అన్నాడు.

"ఏమిటీ?"

"నాతో నిజం - నిజం....చెప్తావా?"

"తప్పకుండా-"

"సరే-ఇటుచూడు...నువ్వు ఎప్పుడన్నా ఇంకోరివల్ల ఆకర్షింపబడ్డావా.... సౌరిస్‌ను మోసం చెయ్యాలని చూశావా?"

ఆమె, "ఓ!" అని సిగ్గుతో ఎర్రబడ్డ ముఖాన్ని భర్త కంఠానికి ఆనించింది; కాని ఆమె నవ్వుతూన్నట్టు ఆంటోనికి .... తెలుస్తూనే వుంది.

"చెప్పు...వాడితలే పెద్ద బాన లాగుండేది. వాణ్ని చూస్తేనే నవ్వొచ్చేది. ఇప్పుడు నాకు చెప్పవచ్చుగా, ఒప్పుకో-ఏంటి? - నాకొక్కడికేగా- నువ్వు చెప్పేది?"

(నాకొక్కడికేగా) అనేమాటను నొక్కినొక్కి అన్నాడు. దీని అర్థం... ఆ పోయిన భర్తకు ఆమె ద్రోహం చేసివుంటే, తనొక మగవాడన్నమాటే! ఆమె సమాధానంకోసం ఆతృతతో చూడసాగాడు.

ఆమె జవాబు చెప్పకుండా, ఏదో బాగా నవ్వు తెప్పించే విషయాన్ని జ్ఞాపకం చేసుకుంటూన్నట్టు పెద్దగా నవ్వసాగింది. ఇదిచూసి, తను సొరిస్‌ను నిజంగా పెద్దమూర్ఖుణ్ని చెయ్యగలిగినందుకు తనను తను మెచ్చుకుంటూ, ఆంటోనీ భార్యతోపాటే తృప్తిగా నవ్వసాగాడు. అమాయకపు సొరిస్! ఎంత ఆనందం!

నవ్వుతో తెగబడే మాటల్తో ఆంటోనీ అన్నాడు: "వెధవ! ... సొరిస్... మూర్ఖుడు...సొరిస్! సొరిస్."

ఆమెమాత్రం కళ్ళవెంట నీళ్లువచ్చేదాకా నవ్వుతో మెలికలు తిరుగుతూ పక్కమీద దొర్లసాగింది.

ఆంటోనీ మళ్లీ అన్నాడు: "ఒప్పుకో...ఊ...నిజంచెప్పు-ఇలాటి మాటలు వినటమంటే నాకు ఆనందమని వేరేచెప్పాలా?...ఒప్పుకోవూ?"

ఆమె ఎలాగో నవ్వాపుకుంటూ, "ఊ...అవును-" అంది.

ఆంటోనీ ఆమె సమాధానంకోసం పట్టుదల వహించాడు, "అవునా? చూడు...అంతాచెప్పు-" అన్నాడు.

గొప్ప ఆనందాన్నిచ్చే విషయాన్ని వినేందుకు పడే ఆతృతను సూచిస్తూ, తన వైపు తిప్పిన భర్త చెవి దగ్గర ఎంతో తృప్తిగా నవ్వుతూ, ఆమె మెల్లిగా గొణిగింది. "అవును-అతనికి ద్రోహం చేశాను."

ఏదో విద్యుత్ ప్రవాహం అతనిలో పాకినట్టయింది. మెల్లిగా అన్నాడు: "నువ్వు....నువ్వు నిజంగా సొరిస్‌ను మోసపుచ్చావన్నమాట?" ఆ మాట భర్తను ఎంతో ఆనందింపజేస్తోందనే నమ్మకంతో ఆమె అంది: "అవును-నిజంగానే!"

అతను ఊపిరి బిగబట్టి పక్కమీదలేచి కూర్చుంటూ, తననే మోసపుచ్చినట్టుగా ఇప్పుడు భార్య నోటివెంట విన్నట్టు ఆశ్చర్యపడుతూ, మాట్లాడటానికి ఒక నిమిషం వ్యర్థప్రయత్నం చేసి, తరువాత, "ఆఁ" అని మాత్రం అనగలిగాను.

తన పొరపాటును చాలా ఆలస్యంగా గ్రహించి, ఇప్పుడు ఆమె కూడా నవ్వు ఆపింది.

కాస్త ఆగి ఆంటోనీ, "ఎవరితో-?" అని అడిగాడు.

ఆమె కొంచెం కష్టంతో అంది: "ఒక యువకుడితో-"

ఒక్కసారిగా అతను ఆమెవైపుతిరిగి, ఎండుకుపోతూన్న గొంతుతో, "వంటవాడితో కాదనుకుంటాను-చెప్పు-ఎవరితోనో చెప్పు-ఎవరో నాక్కావాలి - తెలిసిందా" అన్నాడు.

ఆమె జవాబు చెప్పలేదు. ఆమె కప్పుకున్న బట్టను లాగిపారేసి, ఆమెను పక్కమధ్యకులాగి, "ఏ యువకుడితో - చెప్పు - త్వరగా?" అన్నాడు.

"నేను నవ్వులాటకన్నాను-" ఆమె ఎంతో కష్టంతో యీ మాటల్ని అంది. కాని ఆంటోనీ కోపంతో ఊగిపోతూ, "ఏమిటీ? నవ్వులాటకా?...ఈ పిచ్చి మాటలన్నీ నా దగ్గర చెప్పవోక...చెప్పు...ఆ యువకుడి పేరేమిటో చెప్పు-" అన్నాడు.

ఆమె జవాబు చెప్పలేక, ఆశ్చర్యంతో మూగవోయింది. ఆమె చేతిని గట్టిగా నొక్కుతూ, "నీకు వినపట్టంలేదా?" "నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పు-తెలిసిందా?" అన్నాడు - ఆంటోనీ.

ఆమె బలహీనస్వరంతో అన్నది: "మీకు పిచ్చెక్కుతూన్నట్టుంది - నన్ను ఒంటరిగా ఉండనివ్వండి-"

అతను కోపంతో ఊగుతూ, ఆమెను బలంకొద్దీ ఊపుతూ తను ఏమంటున్నాడో తెలుసుకోలేని స్థితిలో అన్నాడు: "నువ్వు వినిపించుకుంటున్నావా? తెలిసిందా?" ఒక్కసారిగా ఆమె విదిలించుకొని, అతని చేతుల్లోంచి బైటపడి, తనవేళ్ల చివర్లతో అతని ముక్కుమీద చిన్న దెబ్బ వేసింది. ఆంటోనీ తనను తను మరిచిపొయ్యాడు. తనను ఆమె తిరస్కరించి కొట్టినట్టుగా భావిస్తూ, ఆమెమీదికి ఉరికి, ఆమె ముఖంమీద బాదుతూ, "మోసకత్తెవు! మూర్ఖురాలివి! కులటవు! ఇదుగో నీకో బహుమానం - ఇంకోటి!" అంటూ, ఆయాసం వచ్చేదాకా ఆమెను కొట్టి, సేద దీర్చుకునేందుకు, పక్కగదిలోవున్న కాఫీ ఫ్లాస్కుకోసం వెళ్లాడు.

తన తెలివితక్కువచేత తన సౌఖ్యాన్నంతట్నీ, పాడుచేసుకున్నందుకూ, మంచి దెబ్బలు తనకు బహుకరింపబడ్డందుకూ ఆమె పక్క మధ్యలో కూర్చొని పెద్దగా ఏడుస్తూ, పక్క గదిలోని భర్తను ఉద్దేశించి, దుఃఖంతో తెంచబడే మాటల్తో అంది; "చూడండి ... మీతో అబద్ధమాడాను..అంతా చెప్తాను ... ఒక్కసారి రండి-" ఇప్పుడు స్వరక్షణార్థం ఆమె మెల్లిగా తలెత్తి, ఎండుకుపోతూన్న గొంతుతో జాలిగా ప్రార్థించింది.

ఆంటోనీ ఆమెనుచూసి జాలిపడుతూ, ఆమెను అమితంగా బాధించినందుకు నొచ్చుకుంటూ, ఆమెను దగ్గరకు లాక్కున్నాడు. కాని భర్త రూపాన ఆమె మీద గొప్ప హేయభావం కలిగింది; ఈ ఒక్క సమయాన మాత్రమే, పోయిన సౌరిస్ మీద ఆంటోనీకి గొప్ప స్నేహభావం కలిగింది.